

# మాతృభాషలోనే సంస్కృతి మమేకం



- తెలుగును నిర్బంధంగా బోధించాలి
- తానా ప్రతినిధుల అభిప్రాయాలు

న్యూస్‌టుడే, రవీంద్రభారతి

తెలుగు భాష మృతభాషల జాబితాలో చేరిపోతోందని బాధపడితే సరిపోదు... మాతృభాషలో మనదైన సంస్కృతి మమేకమై ఉందనే వాస్తవాన్ని భావితరాలకు తెలియజేయాలి... చైతన్యపరచాలి... తెలుగును నిర్బంధంగా అమలు చేయాలని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు సూచిస్తున్నారు. తానా ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడానికి నగరానికి వచ్చిన సంస్థ అధ్యక్షులు కోమటి జయరామ్, ఉపాధ్యక్షులు తోటకూర ప్రసాద్, సాంస్కృతిక విభాగ ఛైర్‌పర్సన్ విజయ ఆసూరి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.



ప్రసాద్ తోటకూర



విజయ ఆసూరి



కోమటి జయరాం

**పండగల్ని మేమే జరుపుతాం:** 'అమెరికాలో స్థిరపడిన తెలుగువారికి మనభాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడానికి భారతదేశం నుంచి కళాకారుల్ని, సాహితీవేత్తల్ని తీసుకెళ్లాం. మేము స్వరాష్ట్రానికి దూరంగా ఉండటం వల్లే కాబోలు భాషకు మరింతగా దగ్గరయ్యాం. పండగల్ని కూడా మీకంటే మేమే ఘనంగా జరుపుతాం. అమెరికాలో ఎవరైన తెలుగువారు కనిపిస్తే.. ఉండే ఆనందం మాటల్లో వ్యక్తం చేయలేం. విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రుల పిల్లలు కూడా భాష, సాహిత్యాల పట్ల మమకారాన్ని పెంచుకుంటున్నారు. బయట ఏ భాషలో మాట్లాడినా.. ఇంట్లో కచ్చితంగా తెలుగులో మాట్లాడాల్సిందే. కానీ ఇక్కడ మాతృభాషలో చదవడం.. రాయడం రానివారు కూడా పట్టభద్రులవుతున్నారంటే.. ఇంతకంటే దురదృష్టకరం ఏముంటుంద'ని కోమటి జయరామ్ ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతి నగరంలో తెలుగు పాఠశాల:** మాతృభాషను గౌరవించే విషయంలో తమిళులు ముందున్నారు. మనకా చైతన్యం లేకపోవడం దురదృష్టకరం. మా పిల్లలు మాతృభాషను నేర్చుకోవడానికి ఎంతో ఉత్సాహాన్ని చూపిస్తారు. కానీ ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తానా భాషా, సంస్కృతులకు పెద్ద పీట వేస్తూ.. ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగానే డెల్లాస్‌లో ప్రతి నెల మూడవ ఆదివారం సాహిత్య కార్యక్రమాలు ఉంటాయి. తెలుగుభాష పరిరక్షణ కోసం యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ (ఆస్టిన్)లో ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టాం. తెలుగువారు, ఇతర రాష్ట్రాలవారు, పాశ్చాత్యులు సైతం తెలుగు నేర్చుకుంటున్నారు. ప్రతి నగరంలో ఒక తెలుగు పాఠశాల కచ్చితంగా కనిపిస్తుంది. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు మీడియా కృషిచేయాల'ని తోటకూర ప్రసాద్ అన్నారు.

**ఉద్యమస్థాయిలో:** ప్రతి విషయంలో ప్రభుత్వాన్ని నిందించడం సబబు కాదు.. భాషాభివృద్ధికి మనమేం చేస్తున్నామని ఒక్కసారి ప్రతివారూ ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమెరికాలో ఉన్నా, భారత్‌లో ఉన్నా... వేసే ప్రతి అడుగు ఇంటి నుంచే మొదలవుతుందన్న నిజాన్ని తెలుసుకోవాలి. భాషను బతికించుకోవడానికి, యువతరాన్ని జాగృతపర్చడానికి ఉద్యమస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలి. విద్యాలయాల్లో తెలుగును నిర్బంధంగా అమలు చేయాలి. పిల్లలకు ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలు, కళల పట్ల చిన్నప్పటి నుంచే ఆసక్తిని పెంచాల'ని విజయ ఆసూరి సూచించారు.

# చంద్రగిరి కోటలో 22, 23 తేదీల్లో తానా ఉత్సవాలు

**విజయవంతం చేయాలని మంత్రి అరుణకుమారి ఆదేశం**

ఎంఆర్ పల్లె, డిసెంబర్ 11 (ఆన్‌లైన్): చంద్రగిరి కోటలో ఈనెల 22, 23 తేదీల్లో శ్రీకృష్ణదేవరాయ తానా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి గల్లా అరుణకుమారి అధికారులను ఆదేశించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆమె అధికారులు, తానా ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) అధ్వర్యంలో రెండేళ్లకోసారి మన రాష్ట్రంలో నిర్వహించే ఉత్సవాలకు.. ఇప్పుడు చంద్రగిరికోట వేదికైందన్నారు. శ్రీకృష్ణదేవరాయ పంచశతాబ్ది ఉత్సవాల్లాగే.. ఇప్పుడూ సంప్రదాయ దుస్తులను ధరించి రావాలన్నారు. మొదటి రోజున మూలస్థాన ఎల్లమ్మ దేవాలయం నుంచి కోట వరకు కళా బృందాలు, వివిధ వేషధారణల్లోని విద్యార్థులతో ఊరేగింపు సాగుతుందన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో జముకు, ఒగ్గు, తప్పిడిగూళ్ళు, భువన విజయం లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఇక ఇస్కాన్ నిర్వాహకులు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. చిత్తూరు ఎంపీ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. మన సాంస్కృతిక సంప్రదాయాలను తెలిపే ఉత్సవాలు మరోసారి కనువిందు చేయబోతున్నాయన్నారు. తానా అధ్యక్షుడు కోనేటి జయరాం మాట్లాడుతూ.. పాశ్చాత్య మోజులో వెనకబడుతున్న తెలుగు సంస్కృతి, కళలను పరిరక్షించుకోవడం మన విధి అన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం సహకారం అందిస్తుందని కలెక్టర్ శేషాద్రి తెలిపారు. తానా చైతన్య స్రవంతి తెలుగు వైభవం ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యక్షుడు తోటకూర ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ, తుడ వీసీ పెంచల్‌రెడ్డి, డ్వామా పీడీ చంద్రమౌళి, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్, ఆర్డీవో ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ వేరనాగన్న, తిరుమలయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ఉపేంద్రరెడ్డి, సుధాయాదవ్, ఎంపీడీవో సుశీలాదేవి, ఆర్టీసీ, ఇస్కాన్ అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అరుణకుమారి